క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన హమీద్

కోరుట్ల: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ అబ్దుల్ హమీద్ మంగళవారం బీఆర్ఎస్‌లో చేరాడు. ఆయనకు పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరికొంత మంది మైనార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై డీపీవోకు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: గ్రామపంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి దేవరాజుకు వార్డుసభ్యుడు కనక జగన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొద్ది రోజుల క్రితం పేరు మార్పిడి కోసం అఫిడవిట్ ఇచ్చానని, పేరు మార్పిడి ఇచ్చుటకు ఇప్పటివరకు ఏం సమాధానం చెప్పకుండా పనులు చేయడం లేదని, దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, మా 8వ వార్డులో మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంగెంలో కొనసాగుతున్న హెల్త్ క్యాంప్,శానిటేషన్



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో డెంగీ జ్వరాలు సోకుతున్న నేపథ్యంలో గ్రామంలో మంగళవారం రెండో రోజు అయిలాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు .గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్ చర్యలు చేపట్టారు. డ్రెయినేజీలు శుభ్రపరిచి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురికి నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. వైద్య శిబిరంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రవళి, కార్యదర్శి శ్రీకాంత్, కారోబర్ అనిల్, సుజాత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. హుండీలో రూ. 72,150 నగదు సమకూరిందని దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. రవికిషన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రమ్, పూజారి బీర్నంది నరసింహాచారి, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య పాల్గొన్నారు.

'హత్య రాజకీయాలు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కథలాపూర్: రాజకీయ పబ్బం గడుపుకోవడానికి తెలంగాణలో హత్య రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి మండిపడ్డారు. మంగళవారం కథలాపూర్‌లో మాట్లాడారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తులతో దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ ఖండించారు. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం అంచెలంచెలుగా ఎదుగుతోందని, తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూసి కేంద్ర ప్రభుత్వ సంస్థలు మెచ్చుకున్నాయన్నారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో కల్లోలం సృష్టించి హింసలను ప్రేరేపించేలా వ్యవహరిస్తుందని, సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే దివ్యాంగులకు భరోసా

- దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి



దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

కథలాపూర్: బీఆర్ఎస్‌తోనే దివ్యాంగులకు భరోసా కలిగిందని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. కథలాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహరావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. గత పాలకులు దివ్యాంగులను పట్టించుకోలేదని, మానవత దృక్పథంతో దివ్యాంగుల కోసం సీఎం కేసీఆర్ పింఛన్‌ను రూ. 4,016కు పెంచారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అరకొరగా ఆసరా పింఛన్లు ఇస్తున్నారని, ఇక్కడ వారు పలికే ప్రగల్భాలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, గంగారెడ్డి, బాలు, ఆంజనేయులు, మామిడిపెల్లి రవి, బద్దం మహేందర్‌రెడ్డి, పిడుగు తిరుపతిరెడ్డి, ఏజీబీ మహేందర్, చెల్లపెల్లి అంజయ్య, గడ్డం శేఖర్ రెడ్డి, తీట్ల శంకర్, దొప్పల జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డికి మండల దివ్యాంగులు పలు సమస్యలను విన్నవించారు. దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 5 శాతం రిజర్వేషన్, ఉపాధికోసం దివ్యాంగుల బంధు పథకం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, నియోజకవర్గంలో అర్హులైనవారికి స్కూటీ వాహనాలు ఇవ్వాలని కోరినట్లు దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్, ఉపాధ్యక్షుడు దేవదాస్ తెలిపారు.

కిడ్నీ బాధితురాలికి రూ.1.33 లక్షల సాయం

- సామాజిక మిత్రుల ఔదార్యం



సాయం అందిస్తున్న బ్యాంకు మేనేజర్,

ధర్మపురి: రెండు కిడ్నీలు చెడిపోయి వైద్య ఖర్చుల కోసం కొట్టుమిట్టాడుతున్న ఓ నిరుపేద మహిళకు సామాజిక మిత్రులు రూ.1.33 లక్షలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మల్యాల మండలకేంద్రానికి చెందిన జెల్లెల్ల రమేశ్, మీనాక్షి దంపతులు. మీనాక్షి బట్టలు కుడుతూ.. రమేశ్ బట్టలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మీనాక్షికి ఏడాది క్రితం రెండు కిడ్నీలు చెడిపోయాయి. అప్పటినుంచి జగిత్యాల ఆస్పత్రిలో డయాలసిస్ చేయిస్తున్నారు. రవాణా, మందుల ఖర్చులు భారంగా మారాయి. నాలుగు నెలల క్రితం డయాలసిస్ శస్త్రచికిత్స చేసి పైపు వేయగా నెల క్రితం చికిత్స విఫలమైంది. మరోసారి శస్త్ర చికిత్స చేయాల్సి ఉండగా ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో రూ. లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆ మొత్తం కూడా లేని కుటుంబం దాతల సాయం కోరింది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి అక్టోబర్ 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు రూ.1.33 లక్షలు పంపించారు. ఆ మొత్తాన్ని హెచ్‌డీఎఫ్‌సీ జగిత్యాల శాఖ మేనేజర్ అనిల్‌కుమార్ చేతులమీదుగా మంగళవారం అందించారు.

ఇందిరాగాంధీకి నివాళి



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న కృష్ణారావు



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కృష్ణారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, సత్యనారాయణ, నయీం పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, బెజ్జారపు శ్రీనివాస్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. దేశ ప్రధానిగా ప్రజా సంక్షేమం కోసం ఇందిరా గాంధీ అమలు చేసిన పథకాలు, అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్ నాయకులు శ్రీనివాస్, మల్లారెడ్డి, విజయభాస్కర్, సతీశ్‌రెడ్డి, సుధీర్,రామగౌడ్, శ్రీధర్‌రావు, వంశీధర్‌రావు, ఎల్లయ్య, ప్రమోద్ పాల్గొన్నారు.

రాజకీయ ఘర్షణలకు పాల్పడితే కేసులు

పెగడపల్లి: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో యువత జాగ్రత్తగా ఉండాలని మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్ సూచించారు. ఎన్నికల్లో యువతా ఘర్షణలకు పాల్పడి పోలీసులు కేసులు నమోదైతే విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని సీఐ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎస్సై సతీశ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు.ఎన్నికల్లో గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఘర్షణలకు పడే ముందు ఒక్క నిమిషం ఆలోచిస్తే మంచిదన్నారు. కేసులైతే ఉద్యోగాలపై ప్రభావం చూపుతుందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని యువత ఘర్షణలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని యువత, ప్రజలను సీఐ కోరారు

ఐక్యమత్యంగా ఉండాలి

జగిత్యాల: ఐక్యమత్యంగా ఉంటేనే అన్ని పనులు సాధ్యమవుతాయని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. టీఆర్‌నగర్,బుడిగజంగాల కాలనీలో ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఐక్యతగా ఉండాలని, సమష్టిగా ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం పిల్లలచే ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



నివాళి అర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ, పోలీసులు



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న అధికారులు

జగిత్యాలటౌన్/జగిత్యాలక్రైం/కోరుట్ల/మెట్‌పల్లి/సారంగాపూర్/ రాయికల్/జగిత్యాలఅగ్రికల్చర్/పెగడపల్లి/కథలాపూర్/ఇబ్రహీంపట్నం: సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూళ్లు, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆయన చిత్రపటాలకు నివాళి అర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు ఎక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



పెగడపల్లిలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

ఆరోగ్య సమాజ నిర్మాణమే లయన్స్‌క్లబ్ ధ్యేయం

మల్లాపూర్: ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లయన్స్ క్లబ్ ధ్యేయమని, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని లయన్స్ అధ్యక్షుడు కనుక సంజీవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. 52 మందికి శస్త్ర చికిత్స కోసం కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మండల అధ్యక్షుడు కనుక సంజీవ్, కార్యదర్శి తోట రాజరెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పలకలు,పుస్తకాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం 25 మంది విద్యార్థులకు పలకలు, బలపాలు, నోట్ పుస్తకాలను ఉమ్మడి జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం కార్యదర్శి పెంట లింబాద్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కొమరం మాధవి, దేవి, హెచ్ఎం నవీన్, నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన నళిని కుమారి మంగళవారం డాక్టరేట్ అందుకున్నారు. సెలెక్టెడ్ ఇండియన్ ఉమెన్స్ మహిళ జీవిత కథనాల పై రీసెర్చ్ చేసిన నళిని ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు .ప్రస్తుతం నళిని సిద్దిపేట మహిళా పాలిటెక్నిక్ కాలేజ్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొడిమ్యాల మండలంలో మొదటి మహిళా డాక్టరేట్‌గా గుర్తింపు పొందడంతో పలువురు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గొల్లపల్లి: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రక్తహీనత గల గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత అధిగమించవచ్చన్నారు. అనంతరం 83 మందికి రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి రాధిక పాల్గొన్నారు.

ఈనెల 7 వరకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు గడువు

జగిత్యాల:నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ఫీజుకు ఈనెల ఏడు వరకు గడువు ఉందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు ఫారం, అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 8లోపు డీఈవో కార్యాలయంలో అందించాలన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత



మెట్‌పల్లి: పట్టణంలోని సెక్షన్ -1 పరిధిలో ఉన్న పాత బస్టాండ్, ఆర్టీసీ డిపో, రెడ్డి కాలనీ, గోల్ హన్మాన్, గ్రంథాలయం రోడ్, వ్యవసాయ మార్కెట్ యార్డు, బీడీ కాలనీ, మిషన్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ అమరేందర్ తెలిపారు.

'ఆరోగ్య మహిళ' వినియోగించుకోవాలి



మల్లాపూర్: 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి ఆరోగ్య మహిళ కార్యక్రమం అమలును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ 'ఆరోగ్య మహిళ' కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల్లో ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు వ్యాధుల బారినపడకుండా ముందస్తుగా పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వాహిని, సీహెచ్‌వో రాంమోహన్, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



నామాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. నామాపూర్, నందగిరి, పెగడపల్లి, బతికపల్లి గ్రామాల్లో ఇంటింటా ఈశ్వరన్న పేరిట ఇళ్లిల్లు తిరుగుతూ మండలంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరించారు. మరింత అభివృద్ధి కోసం మరోసారి ఈశ్వర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరుతూ కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిర్వహించారు. గడచిన తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, మూడోసారి అధికారంలోకి వస్తే ఎలాంటి కార్యక్రమాలు అమలవుతాయన్న విషయంపై ప్రచారం చేపట్టారు. డాక్టర్ సంజయ్‌కుమార్ విజయం సాధించాలని కోరుతూ తుంగూర్‌లో ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న సరోజన

మెట్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరిందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తల్లి సరోజన అన్నారు. పట్టణంలోని 13 వార్డు బాలకృష్ణనగర్‌లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కౌన్సిలర్లు, ఉన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో..



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ మూడో వార్డులో కౌన్సిలర్ మోర్గాడ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. నవంబర్ 3వ తేదీన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణంరాజు, కరుణాకర్, దశరథం,మనోజ్, కళ్యాణ్, పురుషోత్తం, రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మేడపల్లి సత్యం

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో సుమారు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపెల్లి సత్యం ఆధ్వర్యంలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పిడుగు ప్రభాకర్‌రెడ్డి, చిలువేరి నారాయణగౌడ్, చంద్రమోహన్‌రెడ్డి, గడ్డం జీవన్‌రెడ్డి, ముత్యం శంకర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీలను వివరిస్తూ మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో పాటు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ విషయాన్ని వివరిస్తూ ప్రచారం చేశారు.

ఇంటింటా కాంగ్రెస్ పార్టీ ప్రచారం

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అని, ప్రజాసంక్షేమం కోరే వ్యక్తిని ఎన్నికల్లో ఆదరించాలని నాయకులు ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

వెంకట్రావుపేటలో కాంగ్రెస్ ప్రచారం

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడప గడప కూ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఆది శ్రీనివాస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. కొన్ని రాజకీయ పార్టీలు రైతుబంధు, ఆపేస్తామని రేవంత్‌రెడ్డి బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ రైతుల పార్టీ అని, అందరికీ తెలుసని అసత్యాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో నరేశ్ రెడ్డి, సయ్యద్, కొమురయ్య పాల్గొన్నారు.

బీమారం, మేడిపల్లి మండలాల్లో చల్మెడ ప్రచారం

మేడిపల్లి: భీమారం,మేడిపల్లి మండలాల్లో చల్మెడ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. దేశాయిపేట, ఈదుల లింగంపేట గ్రామాల్లో ఏనుగు మనోహర్ రెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు బీఆర్ఎస్ మేనిఫెస్టోతో అన్ని ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో చైర్మన్ వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం సాయంత్రం కొండాపూర్‌లో సుమారు 700 మంది సర్పంచ్ అభిలాష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, హరిచరణ్ రావు, అంగడి ఆనంద్, రావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలతో సమావేశం

మేడిపల్లి: భీమారం మండలంలోని దేశాయిపేట, ఈదుల లింగంపేటలో మంగళవారం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వేములవాడలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో-కన్వీనర్ క్యాథం దశరథరెడ్డి, మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, ఇజ్రాయిల్, మహేందర్ రెడ్డి, గంగప్రసాద్, పాల్గొన్నారు.

బూత్‌లెవల్ అధికారులకు అవగాహన

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులకు మండల తహసీల్దార్ మునీందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వికలాంగులతోపాటు 80ఏళ్లు పైబడిన వృద్ధులకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా ఓటు హక్కు వినియోగించుకునే 12డీ దరఖాస్తుపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్,ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.